కథానిక

# మరుపురాని సంగతులు

"శ్రీ విరించి"

పంచె సరిచేసుకుని, చొక్కా కాలరు పైకి లాక్కుంటూ, తలుపుతీసి, మధ్య గదిలో వున్న 'సుమిత్ర'కు వినబడేటట్లు, చిన్నగా, తలుపు వేసుకోమ్మని చెప్పి బజారు వెంట నడక సాగించాడు ఆనందరావు. మన జీవితంలో పెక్కుభాగం అలవాట్లపై ఆధారపడివుంటుంది. అట్లా తలుపువేసుకోమ్మని చెప్పటం, తలుపు వేసుకొని, ఇంటి పనుల్లో జొరబడి తొమ్మిదికి వంట పూర్తిచేసి, భర్తకోసం ఎదురు చూడటం, అదే సమయానికి అతనూవచ్చి భోజనం కానిచ్చి ఆఫీసుకు వెళ్లటం-రోజూ జరుగుతోన్న పనే. ఇట్లా ఆరు రోజులుచేసిన మీదట, ఏడవరోజు అదే ప్రకారం చేయకపోతే మనిషి ఏదో ఒకరకంగా బాధపడతాడు.

* * *

ఆనందరావు బి. ఏ. ప్యాసయిన ఆరు నెల్ల లోపల తనకుతగిన వుద్యోగం సంపాయించాడు. తలవని తలంపుగా అతనికి సుమిత్ర లభించింది. బి. ఏ. పరీక్ష అయిందాకా అతనసలు వివాహం మాటే ఎత్తలేదు. అంతవరకు ఎవరుగూడా అతని ఎదురుగా ఆ మాటలు రానీలేదు, ప్రశాంతతకు భంగమని వెరచి! తీరా తల్లీ, తండ్రీ యిద్దరూ అడిగేసరికి అతనికి సాచివెయ్యటమే 'మర్యాద'గా తోచింది. "కానిస్తూ ఇప్పుడేం తొందర. వుద్యోగం అయినాక చూచుకోవచ్చును!" అన్నాడు. అందుకు తల్లి-'సంబంధాలు చాలా వస్తున్నై. ఇపుడే నిర్ణయం చేసుకోకపోతే ప్రమాదం!' అన్నది. తండ్రి, 'వుద్యోగానికీ పెళ్ళికీ సంబంధ మేమిటోయ్. చదువుకూ దానికీ కుదరదనే యింతవరకూ వూరుకున్నాం' అన్నాడు. ఆనందరావు మళ్లీ మాటాడటానికి ప్రయత్నించలేదు. గురుజనాజ్ఞ పాలించేవాళ్ళలో ఉత్తమ శ్రేణికి చెందినవాడని అతనికి మొదటినించీ మంచిపేరు ఉన్నది. రంగారావు, ఆనందరావుతండ్రి, మంచి స్థితిపరుడు. సాలీనా చెప్పుకోదగ్గంత ఆదాయమే ఆయనకు వస్తుంది. పైగా ఉద్యోగం వల్ల సంసారం యేకటాకీగా జరిగిపోవటానికి అవకాశాలున్నై.

ఆనందరావు కొక అన్నగారున్నాడు. అతను స్కూలుఫైనలుతో చదువు చాలించాడు. రంగారావు ప్రోద్బలాన యేదో వుద్యోగంలో ప్రవేశించాడు గాని, దాన్ని నిలబెట్టుకో లేకపోయినాడు స్వంత అప్రయోజకత్వంవల్ల. రంగారావుకీ, శంకరానికీ పడేదేగాదు. తండ్రో మాట అంటే కొడుకు దానిని అచ్చు వ్యతిరేకంగా అంటాడు. ఈ మనః కలహాలు రగిలి రగిలి కొండంత అయినై. వీటిలో ఆనందరావు తల్లి కామాక్షమ్మకు తావు లేకపోయింది. ఎవరి పక్షం మాటాడితేయేమో. శంకరానికి కష్టపడడం యిష్టంలేదు. సుఖపడటానికి కావలసినన్ని వీల్లుండగా ఇట్లా వెధవ వుద్యోగాల కోసం పాకులాడటం యేమిటంటాడు. మనం వుద్యోగం వదిలేస్తే, అదిలేక నానా అవస్థలూ పడుతూన్న మరొకడికి అది దొరికి వాడికి మనం తిండిపెట్టినవాళ్లం అవుతాంగదా అని అతని వూహ! ఈ స్వార్థత్యాగం రంగారావుకి నచ్చలేదు. ఆయన దీన్ని 'తనకుమాలిన ధర్మం' అంటాడు. కాని శంకరం తనకు మాలిందేమిటో చెప్పమంటాడు. దానికాయన పెద్ద మేడంత యెత్తూ ఎగిరి, ఉన్న ఆస్థి కరగదింటూంటే ఎన్ని రోజులు వస్తుంది చెప్పమంటాడు శుభాశుభాల విచక్షణ లేకండా. శంకరం "నేను ఆస్థి కరగదింటూ నన్నానా? దీనిమీద వచ్చే ఆదాయం ఏం చేస్తావు? అది దాచుకుని ప్రయోజనం ఏమిటి? విపరీతంగా ఆస్తి పెంచటం వల్ల లాభం ఏమిటో చెప్ప"మంటాడు. ఇద్దరివీ అతకని తత్వాలు. తండ్రి "దమ్మిడీ సంపాదన లేనివాడు" అని శంకరాన్ని గురించి చెబితే అతను - "దమ్మిడీ సంపాదన లేక

పోయినా నేను సుఖపడగలను. వేలు సంపాయిస్తున్నా నీ ప్రాణానికి సుఖంలేదు" అంటాడు. తండ్రి దృష్టిలో కొడుకొక "పనికిమాలిన శుంఠ" అయితే, కొడుకు దృష్టిలో తండ్రి "సుఖపడలేని స్వార్థపరుడు". "నేనేం ఆ స్త్రీపై ఆశపెట్టుకుని లేను" అని రంగారావు అంటే—"నేను ఆ స్త్రీమీద ఆశపెట్టుకోకుండా వుండలేను" అంటాడు. ఈ పోట్లాటల మధ్యనే శంకరానికి పెండ్లయింది. శంకరం మామగారు గూడా గొప్ప స్థితిలో వున్నవాడు. మొదట అంతటివాడితో సంబంధం పెట్టుకోడానికి శంకరం అనుమానించాడు గాని "జానకి"ని చూచినతర్వాత ఏమీ అనలేక పోయాడు. ఇద్దర్నీ కూర్చోబెట్టి పోషించటం రంగారావుకు కష్టంగానే వున్నది. ఆ మాటమాత్రం అతనితో అనలేకండా వున్నారు ఏమీ ప్రయోజనం వుండబోదనే భావనలో. కాని గుడ్డ చాటు నిప్పూ, కడుపులో కుళ్ళూ ఎంతసేపని దాగగలవు? ఇంతవరకూ అనని వాడు శంకరం ఒక్కసారిగా, "నా ఆస్తి నాకు పంచియివ్వు. నీతో పేచీలు పడలేకండా వున్నాను" అన్నాడు. ఈ మాట రంగారావుకి హృదయశూలం అయింది. వ్యవహారం సూటిపోటు మాటలు దాటి, ఇంతవరకూ వస్తుందని కామాక్షమ్మగానీ, రంగారావుగానీ అనుకోలేదు. అసలు శంకరానికి గూడా తెలీదేమో. ఎంత ఆపుకున్నా అక్కడికీ అశక్యమైపోయింది. తర్వాత అతను తను అన్నమాటమీదే నిలబడి పోయాడు.

ఇప్పుడు శంకరం తండ్రితో యే మాత్రం సంబంధంలేకండా వుంటున్నాడు. తన ఆస్థి తా నేలుకొంటూ!... ఈ సంఘటనలన్నీ ఆనందరావుకు మరీ చిన్నవయసులో జరిపోయినై. వీటిని గురించి అంత స్పష్టంగా అతనికి తెలీదు. ఈ విషయంలో తల్లీ దండ్రీ అనుకునే మాటలు మాత్రం వింటోండేవాడు. వాటివల్ల అతనికి అన్నగారి కుటిలత్వమూ, బద్ధకత్వమూ అర్థము అవసాగినై. "యే ముహూర్తాన పెళ్ళిచేశామో, అప్పటినించీ పెచ్చుమీరి పోయాడు. ఆజానకే పుల్లిలెక్కించి వుండాలి. లేకపోతే ఆస్థివిషయం అంతకుముందు ఎన్నడన్నా వొచ్చిందా? 'యే విభాగాలైనా ఆడవాళ్ళమూలంగానే వస్తాయి" అంటాడు ఆనందరావు. కామాక్షమ్మ జానకి తనికిచేసే మర్యాదా, భక్తి శ్రద్ధలూ తల్చుకొని, 'ఆ పిల్ల కలిసేవుంటే ఎంత బాగుండును!" అనుకునేది అప్పుడప్పుడూ. "తీరా కలిసివుంటే మామూలు అత్తాకోడళ్ళలానే అవుతుందేమోలే" అని తృప్తిపడేది. దూరంగా వున్నకొద్దీ గౌరవభావం పెంపొందుతుంది, అని ఆవిడయెక్కడో వినివుండాలి. రంగారావు మాత్రం ఆ శంకరం విషయంగానీ జానకి విషయంగానీ తన చెవిని చేరనియ్యడు. ఎపుడన్నా బజార్లో యిద్దరూ ఎదురుపడటం తటస్థిస్తే పక్కసందులోంచి తప్పుకోవలసిన అవసరం రంగారావుకే కలిగేది గాని, శంకరానికి కలిగేది కాదు. ఈ విషయమై రంగారావు కొడుకుని, "సిగ్గుమాలినవాడు" అనటం గూడాకద్దు!

ఆనందరావు వివాహం యింకా పదిరోజులున్నదనగా కామాక్షమ్మ రంగారావుతో అన్నది, "వాడికో శుభలేక రాయరాదూ. వొస్తేవొస్తాడు" అని! ఆయన తారాజువ్వ అయినాడు. "వాడికా? నే బతికుండగా రాయను. నేనుండగానే ఆస్తి పంచుకుని పోయినాడే, కని పెంచిన విశ్వాసం అయినా లేక? వాడికి దాయాలా నేను! నాకూ వాడికీ సంబంధం అప్పుడే తెగిపోయింది." కామాక్షమ్మ యింతకన్నా గొప్ప సమాధానం యేమీ ఆయన దగ్గర్నించి ఆశించలేదు. ఇరుగు పొరుగు వాళ్ళంతా ఆవిడనే అడగసాగారు. దానికావిడ "నా చేతిలో య్యేమున్నదమ్మా." అన్నది. ఈ మాటకు రెండర్థాలూ తీసి జనం సంతోషించారు. ఒకపక్షంవారు, అంటే కామాక్షమ్మ యెడ అభిమానం చూపేవారు, "అవునుమరి! ఆయనంతటి పట్టుదల మనిషి—" అని వూరుకున్నారు. అవతల పక్షంవారు "అంతకుమాత్రం మొగాడిచేత చేయించుకోలేని అప్రయోజకురాలా? ఆవిడకు యిష్టంలేదేమో—" అన్నారు. రంగారావు మాత్రం - "పిళ్ళకేమిటి మధ్య? వాడు నాతో పోట్లాడిననాడు పిల్లొచ్చి సరిచెయ్యలేదేం" అన్నాడు. కామాక్షమ్మ మాత్రం లోపల కుమిలిపోతున్నది. శంకరం తల్లినోదారుస్తూ "నువ్వేందిగులు పెట్టుకోకమ్మా.

మా కిద్దరికీ లేనిది మధ్య నీకెందుకు? ఆనందం ఓయింటి వాడౌతోన్నాడంటే యీ బెంగేమిటి? వాడూ నాలాగ కాకుండా చూచుకోండి" అన్నాడు. ఆనందరావుకూ, శంకరానికీ మధ్య తేడా పదేళ్లు.

రంగారావు ఆనందరావునించి చాలా ఆశించాడు. ఆయన ప్రసంగవశాన "ఆ శంకరాయిగాడు నాకు తీరని అపచారం చేశాడు. నా వల్ల తనకు సుఖాలు తగ్గుతోన్నట్లు భ్రమించాడు. వాడు విడి వడ్డ క్షణం నించీ యేమైందో నీకు తెలుసునుగా! సమష్టిగానే వుంటే బలంగాని...? నాలుగావులూ, పులీ కథ యేమైంది? నువు నాకు ఇద్దరు కొడుకులంతటి వాడివి. నా ఆశలన్నీ నీమీదనే. నా కోరికలు తీరవలసిన బాధ్యత నీపైనే వున్నది. ఆపని చేసే అర్హత వాడు పోగొట్టుకొన్నాడు. అందువల్ల నీకు మేలే కలిగింది! ఎవరి కర్మం వాళ్ళది." అన్నాడు. ఆనందరావుకు ఇది అర్థం కాలేదు. శంకరం అన్నగారు చేసిన అపచారమేమిటో, దానికి ఫలం యేమి అనుభవిస్తున్నాడో ... అతనికి తెలుసుకో నాసక్తి కలిగింది. ఆక్షణం నించీ దొరికిన సరకు యావత్తూ నిలవ జేయ మొదలెట్టాడు. తండ్రి తనమీదే ఆశలు బెట్టుకునుండటం ఆనందరావుకు గర్వ కారణమే అయింది కాని, ఆ తండ్రి తన కోరిక లేమిటో వివరంగా చెప్పకండా అవి తీర్చవలసిన బాధ్యత తనమీద పడవెయ్యటంవల్ల చింతించాడు. సమయం చూచి రంగారావు శంకరంమీద దురభిమానం అంతా చిన్నకొడుకుదగ్గర వెళ్లగ్రక్కేవాడు. కాని యిందువల్ల కామాక్షమ్మ భయపడిపోయింది. ఒక పక్షంగా వాదించగలశక్తి ఆవిడ యేనాడో కోల్పోయింది. ఈ ప్రసంగాలకంతరాయంగా ఆనందరావు వుద్యోగం అయి, మరోవూరు వెళ్ళటం తటస్థించింది. దంపతులిద్దరూ ఇతను తమ కళ్ల ముందే పచ్చగా వుద్యోగం చేస్తో కాపరం చెయ్యాలని కాంక్షించారు. కాని "విధి" మాత్రం అందుకు వొప్పుకోలేదు.

* * *

ఆనందరావు మామూలుగా ఆఫీసుకు వెళ్లాడు సుమిత్రదగ్గర సెలవు పుచ్చుకుని. ఆఫీసుకుర్చీలో కూర్చొనగానే, జవాను ఉత్తరాలకట్ట ముందు పెట్టాడు. ఆఫీసు వుత్తరాలన్నీ చూచిం తర్వాత తనపేరుతో వచ్చిన కవరు చించటం మొదలెట్టాడు. కవరుమీది తపాలు ముద్ర తనవూరిదే అయినా, దస్తూరి తండ్రిది మాత్రం కాదని నిశ్చయించాడు. కవరులోని కాగితాల బరువు వుండవలసినంతా వున్నది. ఆ వుత్తరం నాలుగయిదు పేజీలువుండి, 'ప్రియ సోదరుడు ఆనందానికి' అని మొదలెట్టి, 'శంకరం' అనే సంతకంతో ముగియటం గమనించాక అతని ఒళ్లు విద్యుత్తు పాకినట్లుగా జల్లుమన్నది. తనకు బాగా బుద్ధి తెలిసింతర్వాత యీ శంకరం అన్నగారితో సరిగా మాట్లాడయినా యెరగడు కనీసం. అప్పుడప్పుడే తను ఆయన్ను గురించి ఆలోచించ మొదలెట్టాడు. ఇట్లాంటి ఘడియలో యీ వుత్తరం రావటం అతనికి దిగ్భ్రమ కలిగించింది.

"...నీకీవుత్తరం ఆశ్చర్యాన్నే కలిగించవచ్చు. ఇలాంటి అమూల్యమైన క్షణాన్ని నీకు యెప్పుడు కలిగిద్దామా అని నేను చాలా కాలంగా యెదురుచూస్తోన్నాను. మనయింటి గుట్టు నీకు పూర్తిగా తెలిపే యీ వుత్తరం అందిన క్షణం అమూల్యమైనది కాకండా ఎట్లా వుండగలదు?

"నన్ను గురించి నువ్వెరిగుండవు. నీకు నాన్న చెప్పేవుంటాడు నా దుర్మార్గాలన్నీ. వాటిలో నీకు నమ్మకం కలిగినా కలగకపోయినా, నా వుత్తరం చదివినమీదట నీలోనివే తర్కించుకుని, నిజానిజాలు గ్రహించి, ఓ నిశ్చితాభిప్రాయానికి వస్తావని తలుస్తాను. నీకీవుత్తరం రాయటంలో నా వుద్దేశ్యం, నా భావాలన్నీ నీనెత్తినిరుద్ది నామాదిరిగా నిన్ను చెయ్యమని గాదు! అట్లా యెవరినీ నేను బలత్కారపరచలేదుగూడ. తల్లీదండ్రీ అంటే నాకూ భక్తి శ్రద్ధలు వున్నవి. వాళ్ళని గౌరవించకండా నేను వుండనూ లేదు. అయితే, నేను అనుభవించిన ఆత్మగతమైన చింతనం అంతా ,నీకు చెప్పటంవల్ల లాభం వుండకపోదనుకుంటాను, కొంతయినా.

"ప్రపంచం డబ్బుమీదే ఆధారపడివుంది. నీవూ యీపాటికి అపాటి జ్ఞానాన్ని పొందే

వుంటావనుకుంటాను. అలాంటిడబ్బు మనదగ్గిర కొల్లలుగా పడివున్నది. దానిని సద్వినియోగ పరచకుండా వుండడం నాకు సుతరామూ యిష్టంలేదు. దాని విలువని వృద్ధిచేసే సూత్రం, దాని సంఖ్యను పెంచటంకాదు. ఈ వినియోగంలో, నా అభిప్రాయానికీ, నాన్న అభిప్రాయాలకూ యెంత తేడావొచ్చిందో నువ్వే ఆలోచించుకో!

" 'మనం పుట్టిందుకు, మన పనేమిటి? మన గ్రహాణశక్తెలా పనిచెయ్యాలి?' అని ఆలోచించి ప్రయోజనం వుండదు. ఒక్కటేమాట నేను మనసులో అనుకొన్నాను; మనకు బోలెడంత డబ్బు వున్నది. సుఖపడటానికి కొదవలేదు. ఆ సుఖపడటానికి శక్తివంచనలేకండా పనిచేదామని! అట్లా, అనుకున్నదాన్ని ఆచరణలో పెట్టాను. ఇక్కడ ఓమాట చెబుతాను. సుఖపడడమంటే నా అభిప్రాయంలో భోగందాన్ని అనుభవించటం మొదలు, వెధవ పానీయాలు సేవించటం వరకూ కాదు! మన ఆరోగ్యానికీ, సంతోష సల్లాపాలకీ ఉపయోగపడేటట్లు చేసుకొన్నాను డబ్బుని! నాపద్ధతి నాన్నకు నచ్చక నన్ను రచ్చకీడ్చటానికి ప్రయత్నించాడు. ఇట్లా నలుగురి నోళ్ళలోనూ బానటం ఇష్టంలేక, గుట్టుగా, చప్పుడులేకండా, ఆస్తి పంచుకుని వివేకంగా జీవిస్తోన్నాను. నేచేసినపని సంఘానికే ద్రోహం అంటాడు నాన్న. అసలు సంఘం అంటే యేమిటి? నేను నిజంగా సంఘద్రోహినే అయితే, యింకా సంఘంలో నివసిస్తూన్నానేం? ఈమాత్రం వూహాజ్ఞానం నాకున్నదనుకోలేదు. ఆయన, నన్నో పొగరుబోతుకింద తీసుకున్నాడే గాని, నిజానికి నేను యింతవరకూ వొక్కదమ్మిడీ- దమ్మిడీ అంటే దమ్మిడీ- దుబారఖర్చు చేసియెరగను. దుబారా ఖర్చంటే నాకు పరమ అసహ్యం. అట్లాంటి వాళ్లనిచూస్తే నాకు డోకొచ్చేటంత పని అవుతుంది.

"ఒక్క విషయం ఆలోచించు, నాన్న తత్వం అర్థమైపోతుంది. ఇట్లా నేనాస్తి పంచుకోటానికి కారణం మీ వొదినేనని నాన్న నీతో అనేవుంటాడు. నువెరగవుగాని, మీ వొదినె సాక్షాత్తు రమాదేవి! దానికీగొడవే తెలీదు అప్పట్లో! అది నాకు సలహాలిచ్చేపాటి జ్ఞానం కలదో లేదో ఆయన వూహించనైనా లేదు. నాకొమాత్రం ఇంగితం లేదుగనకనా, ఆవిడమాటలు వింటానికి! ఆడవాళ్ళ దుర్బోధల వల్ల కూలిన సంసారాలు లేవని నేనన్ను. కాని మన విషయంలో ఆ ధర్మసూత్రం వర్తించదు... పాపం, అడకత్తెరలో చెక్కలాగ అమ్మ బాధ పడుతూన్నది. ఆవిడకీ విషయా లంతుపట్టవు. పట్టిమాత్రం మనమేంచేశాంలే! కాని, ఆపేక్ష మాత్రం ఒదులుకోలేదు. నాన్నకు తెలీకండా జాగ్రత్తపడి, ఆవిడ నెలక్కనీసం మూడు నాళ్ళన్నా నాయింటికి, వొచ్చి, పది నిమిషాల సేపు కూర్చుని పోతుందని- చాలా మందికి తెలియదు!

"నువ్వుద్యోగంచేస్తోన్నావు. చెయ్యొద్దనను. కాని ఆ వుద్యోగంవల్ల నీ శక్తికేమాత్రంవంచన జరిగినా, ఆవుద్యోగం చేయటం నాకు రుచించదు. నీ సంసారికజీవితం సుఖప్రదంగా జరుగుతూన్న దనుకుంటాను. నువ్వుద్యోగం చేయటం వల్ల నాన్నకు, అమ్మకు దూరమైనావు. నేనుద్యోగం చెయ్యకపోవటంవల్ల దూరమైనాను. రెండింటికీ ఏమిటి భేదం? నాది శాశ్వతమైన దూరం అంటావా? ఏమో ఈ శాశ్వత, అశాశ్వతాలలో నాకు నమ్మకం లేదు.

"జవాబు వ్రాయి. నీకేం అభ్యంతరం లేదనుకుంటాను. వుంటాను."

ఆనందరావు కవరు మడిచి జేబులో పెట్టుకొన్నాడు. అన్నగారు వ్రాసిన భావ పరంపర అతన్ని నాలుగువేపుల్నించీ చుట్టు ముట్టుతూ "తల్లిదండ్రులతో విడిపడటమే చాలు అన్నగారు కర్కోటకు డవటానికి రుజువు" అనుకొన్న ఆనందరావు, "తన అన్నగారు ఎంత ఉదారుడు గొప్ప ఆశయ కాముకుడు!" అనుకొన్నాడు యిపుడు. అన్నగారు ఆలోచించమని చెప్పిన విషయాలు అతనెన్నడూ ఆలోచించలేదు. కాని ఆలోచించటానికి అక్కడేమీ లేదేమోననిపించింది. అంతా ఆయనే అరటిపండు వొల్చినట్లు తేల్చిచెప్పెను! అన్నిటికన్నా శంకరం విషయ వివేచనాశక్తి, శైలి అతన్ని ఎక్కువగా ఆకర్షించింది. జవాబు వ్రాయమన్నప్పుడు, వ్రాయకపోతే మర్యాద

కాదేమోననిపించింది. అదీగాక ఆయన అన్యధా భావించవచ్చును. ఆఫీసు కాగితాల్లో ఇమిడే ముందు, ఓ కవరు రాసి పోస్టు చేయించాడు. ముచ్చటగా మూడు ముక్కలు–"మీ వుత్తరం అందింది. ఆలోచిస్తున్నాను. నా ఆలోచన పూర్తయ్యాక జవాబు విపులంగా రాస్తాను. మనిద్దరి మధ్య వుత్తర ప్రత్యుత్తరాలు సాధ్యమైనంతవరకు రహస్యంగా వుంచడం ఎందుకైనా మంచిది!" అని.

మధ్యాహ్నం మూడు గంటలకు, ఆఫీసు నుంచి యింటికి వెళ్ళిపోతూ ఆనందరావు అన్నగారి వుత్తరం సంగతి జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. శంకరం రాసిందాన్ని, తనింతవరకూ సేకరించుకొన్న సామగ్రితో సరిచూసుకొన్నాడు. అన్నగారు రాసిందాన్లో అబద్ధం అనదగ్గదేమీ కనిపించదు. కాకపోతే, జరిగిన పనికి, యిరుపక్షాలవారూ విడివిడి కారణాలు చెబుతున్నారు. సహజమే! అసలు ఒకే విధంగా చెబితే వాళ్ళకు పోట్లాట యేమున్నదిగనక? అయితే యీ వుత్తరం రాసింతర్వాత శంకరానికి కొంత శాంతి యేర్పడివుండాలి! ఆనందరావు మాత్రం అనుకొన్నదానికన్న ఒక మెట్టు యెక్కువే ఆలోచించాడు. అన్నగారి వేదాంతం మాత్రం అర్థం గాకపోయింది. అతనికి మొదట్లో ఉద్యోగం చెయ్యటంలోవున్న సుఖం ఆయనకు తెలీకపోయిందేమో అనుకున్నాడు. కాని మళ్ళా "తత్వాల" ప్రసక్తి వచ్చేసరికి, ఆ తత్వానికి వుద్యోగం చెయ్యటం సరిపడుండదు. అని తృప్తిపడ్డాడు.

ఇల్లు చేరుకున్నాక సుమిత్ర ఓ కార్డు ఇచ్చింది. అది తండ్రి దగ్గరనుంచి. ఆ సంగతి కనుక్కోగానే ఆనందరావు ఆయన ఆఫీసుకు రాయక, ఇంటి ఎడ్రసుకెందుకు రాస్తున్నాడు? అనుకున్నాడు. ఉత్తరం నిండా అతను జీర్ణించుకోలేని సమాసాలు, ప్రయోగాలూ వున్నయ్! రంగారావు వుత్తరం సారాంశం యేమంటే "జాగ్రత్తగా వుద్యోగం చేస్తూ, దాన్ని నిలుపుకోటానికి ప్రయత్నించు. నెలసరి జీతం రాగానే, ఇంటి సామాన్లన్నీ తెచ్చేసి, మిగిలిన డబ్బు ఏ బ్యాంకులోనో నిలవచేసుకో. వీలైనంతవరకు అనవసర ఖర్చులు చెయ్యొద్దు" రంగారావు చేతి వ్రాతతో యిలాటి వుత్తరాలు రావటం యిది మొదలుగాదు. ఈ వుత్తరం చూచిన తర్వాత ఆనందరావుకి కొద్ది చికాకే కలిగింది! ఏమిటీయన ప్రతిసారీ యిట్లానే రాస్తాడేమని! ఉద్యోగంలో చేరిన తరువాతే గాదు, చదువుకుంటున్నప్పుడు కూడా ప్రతి వుత్తరంలోనూ "డబ్బు జాగ్రత్తగా వాడుకో" అనే అక్షరాలు వుటంకించేవాడు. అప్పుడా రాసిందీ అనవసరమే అయినా దాన్లో యేకొద్దో అర్థం లేకపోలేదు. ఇప్పుడేమయింది? తనంతటివాడు తనూను! ఇట్లా ప్రతిసారీ డబ్బు దుబారా ఖర్చు చెయ్యొద్దని రాస్తూంటే అందులోనూ యింటి అడ్రసుకు, సుమిత్ర తననిగురించి యేమనుకుంటుంది? తనంటే ఓ గొప్ప అభిప్రాయం ఆ పిల్లకి యేర్పడవలసిన అవసరం వున్నది గదా. ఆ యేర్పాటుకు కాలం యిక్కే గదా! ఇలాంటి సమయంలో ఆయనిలా వ్యవహరించటంలోని చౌకబారుతనం ఆనందరావు గ్రహించాడు. ఆయన యింకా తన బాధ్యతలు సర్వమూ నెత్తిన వేసుకోటం అతనికి నచ్చలేదు. తన నిజ స్వరూపం బయలుపరచుకుంటూన్న రంగారావంటే ఆనందరావుకు అభిమానం తగ్గసాగింది!

ఆ సాయంత్రమల్లా ఆనందరావు ఆలోచిస్తూనే వున్నాడు. సుమిత్ర కారణాలు తెలుసుకోగోరింది. వొద్దనుకున్నా, సుమిత్రతో యీ మాటలు అనకుండా వుండలేకపోయాడు.

"నువ్వు మా అన్నయ్య నెరుగుదువా?"

"మీ అన్నయ్యా ... అంటే చిన్నప్పుడే ఆస్తి పంచుకున్న–?"

"అవును, శంకరం అని–"

"ఒకసారి బజార్లో పోతూంటే చూచాను! ఏం?"

"చాలా మంచివాడు!"

"మీరు మాట్లాడుకొంటూరా?"

"ఆ!" అన్నాడు, మరో విషయం గూర్చి ఆలోచిస్తూనే! సుమిత్ర దీన్ని కొద్దిగా ఆశ్చర్యంగానే తీసుకుంది. ఆ పిల్లసలు అత్తవారింట వున్న రోజులే తక్కువ. ఆ రోజుల్లో యీ విషయాల ప్రసక్తి మహా వొస్తే ఓ రెండు

మూడు సార్లకన్నా యెక్కువ వచ్చివుండదు! ఒక్కసారి వస్తే చాలదూ ఎంతవిషయమైనా తెలుసుకునేందుకు?

"అసలేమైంది యిప్పుడు? మీరు సాయంత్రంనించీ ఆలోచిస్తోన్నది దేన్నిగురించి?" అనడిగింది. "దీన్ని గురించే. అసలు మా అన్నయ్య చాలా గొప్పవాడు. మా నాన్నే చెడగొట్టాడు భాగంపంచి!..." "ఒకసారి మీ వొదినగారు నన్ను మాట్లాడించారు, యేటి దగ్గర. నేను మొదట భయపడ్డాను గాని, ఆవిడంత మంచిది లేదు. అయిదు నిమిషాల్లో నన్నాకట్టేసింది-" అంది, సుమిత్ర! ఆనందరావు మరేదో ఆలోచిస్తూవుండి పొయ్యాడు. ఒకపక్క గాఢనిద్ర వస్తూన్నా ఆలోచన దాన్ని తరిమేస్తూన్నది. చివరకోగంట, రెండు గంటలు కలత నిద్రతో మెళుకువ వచ్చేసింది. అప్పటికే తెల్లవారి అరగంట దాటింది!

ఆనందరావుకి తనింత వరకూ అజ్ఞాతవాసం జరిపినట్లు తోచింది. ఇరవైరెండు సంవత్సరాలు వొచ్చినా, తనకెంతో గౌరవనీయమైన అగ్రజుడిని చూడకండా వుండటం పాతకం అనిపించింది. ఏపని చెయ్యబోయినా అలవాటు లేనట్లుగా చెయ్యి తడబడసాగింది. తనలో యిద్దరు వ్యక్తులు- కాదా? శక్తులు!-పోట్లాడుకుని, ఆ గెల్చిన పక్షం వాడు తనని యేదో పనికి బలవంతపెడుతూన్నట్లు బాధపడసాగాడు.

అతను మూడురోజులు సెలవు పెట్టి తండ్రి దగ్గరికి ప్రయాణమైనాడు. ఇంటికి వెళ్ళగానే మొదట తండ్రే కనిపించాడు, ఆనందరావుకి. అతని వైపు చూడ బుద్ధిగాలేదు. కాని-ఆయనే పల్కరించాడు. తలొంచుకునే జవాబుచెప్పి, లోపలికి వెళ్ళిపోయాడు. తల్లి యోగక్షేమాలడిగింది.

మధ్యాహ్నం రెండున్నర గంటలకు భోజనానంతరం కొద్దిసేపు నిద్రపోయాక బయలుదేరాడు ఆనందరావు యింటినించి. తండ్రి- "ఎక్కడికి" అన్నాడు. "ఇప్పుడే బయటకు వెళ్లి వస్తా"నన్నాడు. నిజం చెప్ప గూడదూ! ఏంజరుగుతుందో? ఆనందరావు సరాసరి అన్నగారున్న యింటివేపు వెళ్ళాడు. శంకరం యితన్ని ఆప్యాయంగా ఆహ్వానించాడు. వదినగారుయిచ్చిన చెంబెడు మంచినీళ్లు అతనికి అమృత తుల్యంగా వున్నై. శంకరం కంఠనాదం ఆనందరావుకి ఎంతో ఆహ్లాదకరంగా వున్నది. అది వింటో నాగస్వరం వింటున్న సర్పంలాగ, తన్మయుడైపోయాడతడు. దాంట్లో యేదో శాంతి అతనికి కనిపించింది, ఇన్నాళ్లనించీ దాని కోసమే వెదుకుతున్నానా? అనిపించింది.

"నా వుత్తరం అందిందా" అన్నాడు శంకరం, నాంది ప్రస్తావన చేస్తో! "అందక పోతే యెట్లా రాగలిగే వాడిని!" అని మనసులో అనుకుని, 'ఆ!' అనిమాత్రం పైకన్నాడు. తన వుత్తరం అందిందో లేదో కనుక్కోవటం అనవసరమనిపించింది. వుత్తరాలందక పోవటం యెట్లాజరుగుతుంది?

ఆనందరావుకు మాటకలిపే విధం తోచలేదు. అతను మనసులో చాలా అనుకొన్నాడు, యెప్పుడు అన్నగారి సముఖాన క్షమాపణ వేడుకొందామా, యెప్పుడు హృదయ వేదన వెళ్ళబోసుకుందామా అనుకున్నాడు. అందుకు పర్యవసానంగా అతను కాంక్షించిన మనశ్శాంతి అతనికి అన్నగారి దర్శనమాత్రం చేతనే కలిగింది. ఆ పైన మాట పెగలటమే కష్టమైంది! శంకరం తమ్ముడి అవస్థ అర్థం చేసుకున్నాడు. కాని దాన్లోంచి యివతలపడే తరుణోపాయం అతనికి తోచలేదు. బహుశః అతనికి అందులోనే ఓ విధమైన ఆత్మతృప్తి యేర్పడి వుండొచ్చు! ఇద్దరూ మాట్లాడకండావుండటం కాలమే భరించలేక పోయింది. ఆనందరావు, "నాకు మిమ్మల్గురించి తెలియవలసినంత తెలియదు" అన్నాడు. "ఇప్పటికైనా మించిపోయింది లేదు" అన్నాడు శంకరం, ఆనందరావును ఆశ్చర్యపరుస్తో!

వెల్లువ వచ్చిన నదిలాగా ఆనందరావు వుబుకుతూ, చెప్పనారంభించాడు- "మీరు వ్రాసిన దానివల్ల నాకు జ్ఞానోదయం అయినట్లయింది! అసలంతకుముందు మీరొకరున్నారన్నసంగతే నాకు గుర్తులేదు." జానకి అందుకుంది—"ఇంట్లో యెన్నడూ వున్న అలవాటు లేక!..." అని, ఆవిడని మధ్యలో ఆపేసి, శంకరం- "అంతే, మన జీవితం యావత్తూ అల

వాట్లమీదే ఆధారపడి వుంది కేవలం" అన్నాడు. ఆనందరావు మళ్ళీ అందుకున్నాడు, "ఉత్తరం చదువుకున్న క్షణంనించీ మిమ్మల్ని చూడాలన్న కోర్కె వెంటతరిమింది. వేట గాడి ముందు పరిగెత్తే లేడిలాగ నా మనసు బాధపడింది. ఇక్కడ కూర్చున్నాక కొద్ది మన శ్శాంతి కలిగినట్లయింది."

"ఇంతకూ యేం ఆలోచించుకున్నావు?" అన్నాడు శంకరం.

"ఇంకా యేమని! నాన్న చేసిన దురాగతాల్ని అన్నీ అర్థమయినై. అయిన వెన్వెంటనే మీ వుదారస్వభావం నాకర్థమయింది! మీ రేంచెప్పినా చేస్తానిపుడు. నన్ను మీ సోదరుడిగా కాకపోయినా, సేవకుడిగానైనా ఒప్పుకోండి. మీ సోదరుడినని చెప్పుకొనే యోగ్యత లేదు నాకు..." అన్నాడు.

"నీకుగాక మరెవరికున్నదా అర్హత? ఒక్క క్షణంలో తప్పిపోయిందిగాని, నువు గొప్ప రాజకీయవేత్త వవవల్సినవాడివి!" అన్నాడు శంకరం. ఆ తప్పిపోయిన క్షణం గురించి ఆలోచించకండానే ఆనందరావు శంకరం తన్ననవసరంగా వుబ్బేస్తున్నట్టు గ్రహించాడు. "మీరు నన్ను తమ్ముడిగా స్వీకరించారు గనక, ధన్యుణ్ణయినాను." అన్నాడు.

"నువు నా తమ్ముడివైతే నాన్న వొప్పుకోడే యెట్లా?" శంకరం.

"మహాచక్కగా వొప్పుకుంటాడు. అయినా ఆయన వొప్పుదలతో మనకు ప్రసక్తేమిటి?" అన్నాడానందరావు.

"ఆయనకు గాక మరెవరికా ప్రసక్తి? అన్నాడు శంకరం, ఓర్పుగా! అన్నగారిధోరణి యేమాత్రం అర్థంగాక, వెర్రివాడిలా చూస్తూ వుండిపోయినాడు ఆనందరావు.

"ఇంతకీ నాకూ, నాన్నకూ ఎట్లా వచ్చిందంటావు పోట్లాట?"

"ఎట్లాగేవిటి? మీరు సుఖపడటం ఆయన కిష్టంలేదు." అన్నాడు ఆనందరావు.

"నేను సుఖపడటం ఆయనకెందు కిష్టంలేకపోయింది?" స్కూల్లో మేష్టరుగానీ, కోర్టులో క్రాస్ఎగ్జామినేషన్ చేసే ప్లీడరుగానీ యింతటి ప్రశ్న వేస్తారని ఆనందరావనుకోలేదు.

"వుద్యోగం చేసి, సుఖపడకండా- డబ్బు దాచిదాచిన సొమ్ము చూచుకు సంతోషించటమే ఆయనకొక్కవల్సింది. దానికి వ్యతిరేకంగా, మీరుద్యోగం మానేసి యింట్లోవుండడం ఆయనకు కష్టంవేసి, ఏదో సెపాన పంచేశాడుఆస్తి!" అన్నాడు చాలాచక్కగా జవాబుచెప్పగలిగానని సంతోషిస్తోనే! కాని "యేసెపాన?" అని శంకరం అనేసరికి,ఆమాట యెంగుకంటినా అని బాధపడుతోనే,"ఆస్తిమీద ఆశలు పెట్టుకూర్చున్నాడు దమ్మిడీ సంపాదనలేకండా అనే సెపాన!" అన్నాడు ఆనందరావు కేవలం జరగని సంగతులు ప్లీడరు సలహాపై వల్లెవేసి వప్పగిస్తూన్న సాక్షిలాగా!

"ఇంతకూ నీకు నాన్నంటే అసహ్యం కలిగింది గదూ?" ఈమాట మొదటనే నివేదించుకొన్న ఆనందరావుకి మరీ ఆందోళన కలిగించింది. "అయితే మనమిపుడేం చేదాం?" అన్నాడు మళ్ళీ శంకరం. "అదే మీరు ఆలోచించండి! చెప్పినట్లు నడుచుకుంటాను" అన్నాడితను. "అట్లా పనికిరాదు. నువ్వా ఆలోచించు. నాకన్నా నీకే యేదైనా తోచవచ్చు. అదీగాక యింకా నాముందు నీ తెలివితేటలు బలాదూరని రుజువుకొందాయెను!" అన్నాడు. ఆనందరావు అర్థంతెలియని ఆలోచనల్లో మునిగిపోయాడు. చివరకు "నన్ను పూర్తిగా అశాంతి ఆవరించింది. ఈవిషయం పరిష్కారం కావాలి."

"అసలు పరిష్కారం అవటానికేముంది?" అన్నాడు శంకరం. ఆనందరావుకు అన్నగారు తన విషయం పూర్తిగా అర్థం చేసుకోలేదనే అనుమానం కలిగింది. "నేనిక నాన్నతో పొత్తు కలిపివుండలేను. మీ కాయన చేసిన అన్యాయం తల్చుకుంటే నా గుండె చెరువై పోతోంది. ఆయన్ని చూస్తే నాకోపం అపరిమితం! కనక, నేనికముందు ఆ యింట్లో వుండలేను. దీనికేం చెయ్యాలో చెప్పండి. నేను యిక్కడే వుంటాను!..." అన్నాడు ప్రాధేయపూర్వకంగా. శంకరం యిక తమ్ముడిని యేమాత్రం వేధించదల్చుకోలేదు; అతను సూటిగా మాటాడ్డం మొదలెట్టాడు డొంకతిరుగుళ్ళు వొదిలి.

"నువ్వు నాన్నతో విరోధం పెట్టుకోవడం మంచిది గాదు. అయినా ఆయన నిన్నేమన్నాడు? నాలాగ నువ్వు వుద్యోగం చెయ్యననలేదుగా!" అన్నాడు.

"ఏమయినా నేనక్కడ వుండలేను. దయచేసి నన్నిక్కడే వుండనీయండి". శంకరం అన్నాడు: 'నాకూ నాన్నకూ ఎందుకుపడలేదు? భిన్నతత్వాలవల్లగదా! మన ఆలోచనలు మనకు సమంజసంగా కనిపిస్తే, ఆయన ఆలోచనలు ఆయనకు సమంజసంగా కనిపించాయి, ఇద్దరి అభిప్రాయాలు ఒకటి గాకపోవటంవల్ల విడిపడటం తప్పలేదు గాని...'

"ఇంతకూ నన్నేం చెయ్యమంటూరు?"

"నువ్వేమీ చెయ్యక్కర్లేదు. నీకు వుద్యోగం సరదాగానే వుందిగదా? అంటే అదీ నీతత్వానికి సరిపడింది గదా అని అడుగుతున్నాను."

"ఆ" అన్నాడు ఆనందరావు "అది నాకు సుఖప్రదంగానే వున్నది."

"అయితే నీవు వుద్యోగం మానెయ్యకు. బదిలీ చెయ్యటం వొస్తే యీ వూరుగాక, మరే వూరయినా వేయించుకో. కాని, వుద్యోగం అంటే విరక్తి కలిగిన వుత్తర క్షణాన రాజీనామా యివ్వటానికి సంశయించకు."

"మరి నాన్నతో విడిపడే విషయం?"

"అదెందుకు? ఆయన మనసు బాధపడేటానికా? నాకుమాత్రం అది తప్పిందిగాదు. నీకు తప్పుతోంది. నీవు దూరంగా వుంటోన్నావు గాని, ఆయనదగ్గర లేవుగదా!"

చిట్టచివరకి ఆనందరావు అడిగాడు "నాన్నంటే మీకు అరికాలి మంట నెత్తికెక్కటం లేదా" అని. "ఎంతమాత్రం లేదు, ఎందుకు? ఎవరి అభిప్రాయాలు వారివి!" అన్నాడు శంకరం.

ఆనందరావు యీ క్షణం ముందువరకున్నూ తను అన్నగారిని పూర్తిగా అర్థం చేసికోలేదని అనుకున్నాడు. అతనిలో ఇంతవరకూ పని చేస్తూండిన ఆ గూఢ శక్తులేవో అతన్ని వదిలి పోయినట్లు భావించాడు. ఆ క్షణంనుంచీ అతనికి ఎంతో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వచ్చినట్లయింది. అన్నగారి దగ్గర సెలవు తీసుకుని మెల్లిగా సాగిపోయాడు. సెలవు ఇస్తూ శంకరం "నేను చెప్పిన సంగతులు మర్చిపోకు" అన్నాడు, "అవి మరవరాని సంగతులు" అనుకున్నాడు ఆనందరావు తనలో తాను ఘాట్టిగా!

# నేటి మన గృహ జీవితం

యస్. వి. ఆర్. వేమూరి

ఇంటిని చూచి ఇంటివారి సంగతి పూర్తిగా చెప్పవచ్చునని తరచుగా మనం అనుకుంటూ వుంటాం. ఏ జాతి మానసిక తత్వం తెలుసుకోవాలన్నా, ముందుగా ఆజాతి గృహ వ్యవస్థను పరిశీలిస్తే వాస్తవం బోధపడుతుంది.

మన గృహ జీవితంలో ఆనందం, ఆపేక్ష, అనంతమైన కోర్కెలమధ్య శిశుపోషణ ప్రారంభమౌతుంది. పిల్లలు చిన్నతనంనుంచి కుటుంబంలోని వారితోపాటు కష్టసుఖాలను పంచుకుంటూరు. ఆడపిల్లలు యుక్త వయస్సురాకపూర్వమే ఇంటి పనులలో ఆరితేరడమే కాక "గృహమే సర్వస్వం" అనే భావాలతో వుంటారు. మొగ పిల్లలకు మాత్రం వయస్సు హెచ్చినకొలదీ ఆదరం పెరుగుతుంది. గారాబం హెచ్చుతుంది. కష్టపడగల శక్తివుంటుంది కాని ముందుకుపోగల చొరవ కొరవడుతుంది. క్రమశిక్షణ, అనేదానికి అర్థం తెలియక, భావి జీవితాన్ని దుఃఖభాజనం చేసుకుంటూరు.

ఇంకా వీరి విద్యాభాగంలో ప్రజ్ఞ, పరిశీలనా శక్తి పెంపుదలకంటే "జ్ఞాపకశక్తి" పెంచడానికి ఎక్కువ కసరత్తు చేయించడం